కథ

# అదే ప్రశ్న

- పలమనేరు బాలాజీ

ఆ ఇంటి ముందు నిలబడి ఇల్లు అదేనా కాదా అన్నట్లు పరీక్షగా చూసింది కమలమ్మ. వేణుగోపాల స్వామి గుడివీధి, మల్లెపూల పందిరిల్లు, రెండంతస్థుల పాత బిల్డింగు. గుర్తులన్నీ సరిపోయాయి.
అయినా లోపలికి వెళ్లాలంటే భయమేసింది. కాళ్లకేదో అడ్డం పడుతున్నట్లు అనిపించింది. గేటు ముందరే నిలబడి లోపలికి వెళ్లటమా, మానటమా అనే సందిగ్ధంలో పడింది.
వెళ్లాల్సిందే, వెళ్లకపోతే ఎట్లా?
ముగ్గురు పిల్లలు, సంపాదనలేని తాగుబోతు మొగుడు, ముసలి అత్త, ఆవిడ రోగాలు, ఇంటిల్లిపాది ఖర్చులు, అప్పులు.. అన్నీ గుర్తొచ్చాయి.
ఇంట్లో పరిస్థితులు గుర్తొచ్చే కొద్దీ ఆమె అక్కడ నిలబడలేకపోయింది. వెనక నుండి ఏదో శక్తి ముందుకు తోస్తున్నట్లుగా చప్పున కదిలి గేటు తెరచుకుని లోపలికి అడుగు పెట్టి కాలింగ్ బెల్ మోగించింది.
అప్పటికే ఆమెకు మొహంనిండా చెమట్లు పట్టేశాయి.
ముప్పై అయిదు దాటి వుంటుంది వయసు. సన్నగా పొడవుగా వుంది. ముదురు రంగు చీర, చామనఛాయ.
తలుపు విసురుగా తెరచుకుంది.

'ఎవరూ..'

'నేనండీ.. కమల.. కమలమ్మ..'

'ఏం కావల్లి? ఎవరికోసం'

'నేను.. పని కోసమండి. మీ పక్కింట్లో పని చేసే సుభద్రకి మనిషి కావల్లని చెప్పారంట కదా!' గబగబా అనేసింది కమలమ్మ.

నుదుటిపైన పట్టిన చెమటను చీర కొంగుతో తుడుచుకుంటూ పూర్తిగా తెరవబడని తలుపు వైపే చూస్తూ నిలబడింది. కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత తలుపు పూర్తిగా తెరచుకుంది. భారీ శరీరం ఒకటి సోఫాలో నింపాదిగా కూర్చుంది. టీపాయ్ మీద ఏవేవో తినుబండారాలు కనబడుతున్నాయి.

టీవీలో ఏవేవో దృశ్యాలు కదిలిపోతున్నాయి.

'ఊ.. ఎక్కడుండేది నువ్వు. ఏయే పనులు చేస్తావ్? బాగా పని చేస్తావా? ఎంత కావల్ల నీకు నెలకు?''

టీవీ వైపే చూస్తూ అడిగింది ఆ ఇంటి యజమానురాలు జానకమ్మ.

'అన్ని పనులూ చేస్తానమ్మా.. మీ పక్కింట్లో పని చేసే సుభద్ర ఉండేది మా పక్క వీధిలోనే. మేం నాగలకుంటలో వుంటాం. జీతం మీ ఇష్టం అమ్మా..'మెడ వంచి చేతులు పిసుక్కుంటూ చెప్పింది కమలమ్మ.

తలెత్తి ఇల్లంతా ఒకసారి పరిశీలనగా చూడాలనుకుంది. అది చాలా పెద్ద ఇల్లని తెలుస్తోంది. ఎంతుందో, ఎంత పనుంటుందో తెలుసుకుందామనుకుంది. ఇంట్లో ఎంతమంది వుంటారు? ఏయే పనులు చెయ్యాల్సి వుంటుందో అమెనే అడుగుదామనుకుంది. కానీ అడగాలనుకున్న మాటలన్నీ గొంతులోనే ఉండిపోయాయి. ఇంకేం అడుగుతుందో, ఏం జవాబులు చెప్పాలో అని మనసులోనే అనుకుంటుంటే కమలమ్మకు అప్పుడొచ్చిందొక అనుమానం.ఆ అనుమానం మనసులోకి రాగానే ఆమె మొహం కళ తప్పింది. అడుగుతుందా? ఈ కొత్త యజమానురాలు కూడా తనను ఇంట్లోంచి, పనిలోంచి వెళ్లిపొమ్మనటానికి తన వెనుకబాటు తనాన్నే ఆయుధంగా వాడుకుంటుందా?

తల కొంచెం పైకెత్తి జానకమ్మ వైపు చూసింది. ఆమె మొహం టీవీకే అతుక్కు పోయివుంది. ఆ మొహంలో టీవీలోని పాత్రల హావభావాలు తాలూకు ప్రతిస్పందనలు స్పష్టంగా కనపడుతున్నాయి. తల తిప్పకుండానే టీవీలో ప్రకటనలు వస్తున్నప్పుడు ఉండుండి మాట్లాడుతోంది.

'ఉదయాన్నే ఐదున్నరకల్లా వచ్చేయల్ల. నీ ఇష్టం వచ్చినట్లు చెప్పాపెట్టకుండా పనికి నిల్చిపోకూడదు. ఇంట్లో వస్తువులన్నీ బాగా ఖరీదయినవి వుంటాయి. యాడుండే వాట్ని ఆడ్నే పెట్టల్ల. నా దగ్గర అతిగా మాట్లాడితే కుదరదు. ఎప్పుడన్నా నువ్వు పనికి రాలేదంటే ఆ రోజు ఎవరో ఒకర్ని నువ్వే మాట్లాడి పంపించల్ల. అది కూడా నీ డ్యూటీనే. అర్థం అయ్యిందా?'' జానకమ్మ గొంతు ఖంగుమంది.

ఆమె తన వైపు చూడకపోయినా కమలమ్మ ఆ మాటలకు అంగీకారంగా తలాడిస్తూనే ఉంది. ఇంకేమైనా అడుగుతుందేమోనని కాస్సేపు, ఇంకేమైనా చెపుతుందేమోనని కాస్సేపు మథనపడి గోడల్ని, ఇంటిని ఇంట్లోని వస్తువుల్ని గమనిస్తూ యథాలాపంగా తలతిప్పి చూసే సరికి ఆమె వైపే పరీక్షగా చూస్తున్న జానకమ్మ కనిపించింది. క్షణంలో ఉలిక్కిపడి సర్దుకుంది కమలమ్మ.

'ఎంతమంది పిల్లలు, మొగుడేం చేస్తాడు'

'ముగ్గురు పిల్లలమ్మా, పెద్దది పదో తరగతి , ఎనిమిదొకరు, ఏడొకరు. ముగ్గురూ ఆడపిలకాయలేనమ్మా.. మొగుడంటారా వాడుండీ ఒకటే. లేకపోయినా ఒకటే. ఇంతకుముందు సినిమా థియేటర్లో పని చేసేవాడు. కట్టెల మండీలో ఇప్పుడు పనికి బోతావుండాడు'

'ముగ్గురూ ఆడపిల్లలేనా?' అదేదో తప్పన్నట్లు, తక్కువన్నట్లు చులకనగా చూస్తూ అడిగింది జానకమ్మ.

నిశ్శబ్దంగా తలాడించింది కమలమ్మ.

'ఇప్పుడు గర్భంగా వుండావా ఏమైనా?' అదో రకంగా పొట్టవైపు చూస్తూ అడిగింది.

'లేదమ్మా, లేదు లేదు..' అనేసింది కమలమ్మ. ఎక్కడ నిజం చెప్పేస్తే ఆమె పనిలోకి రావద్దటుం దేమో అని భయపడి పోయింది.

నాలుగో సంతానం వద్దు వద్దంటున్నా తన మాట అసలేమాత్రం చెవిలో వేసుకోని మొగుడ్ని మనసులోనే తిట్టుకుంది. అయినా మనిషిని చూసీ చూడగానే ఈ పెద్దమనిషి ఎట్లా సంగతిని కనిపెట్టేసుంటుంది? నాలుగో నెల కూడా రాలే దింకా, అయినా ఏం మనిషబ్బా, ఎంత నేగ్గా కని పెట్టేసింది అనుకుంది కమలమ్మ మనసులోనే.

'ఇల్లు చూస్తావా'

'వొద్దులే అమ్మా. ఒకేసారి పనిలోకి వస్తా కదా. అప్పుడు చూస్తాలే' వెళ్లటానికి సిద్ధపడుతూ అంది కమలమ్మ.

'అవునూ సుభద్రకు చెప్పానే క్లియర్‌గానే. ఎవ రైనా ముసలివాళ్లుంటే చూడమని చెప్పినా. నలభై ఐదు దాటినోళ్లయితే బావుండేది. వయసు పనో ళ్ళతో చానా కష్టం. మీ ఏరియాలో ముసలోళ్లు ఎవరూ లేరా? మీ ఇంట్లో కూడా ఎవరో ముసల్ది ఉందంట కదా? ముందు ఆమెనే రమ్మని చెప్తా మనుకుంటి'

జానకమ్మ మాటలతో కమలమ్మకు స్పృహ తప్పుతున్నట్లు అనిపించింది. ఎంత కూపీ లాగిం డాది ఈమె అనుకుంటూ 'మా అత్తకి డెబ్బయి దాటిండాదమ్మ. కళ్లు కనబడవు' అంది అపద్ధం చెపుతూ, నవ్వు మొహంతో.

యాభైఐదేళ్ల అత్తగారికి పొద్దస్తమానమూ వక్కాకు నములుతూ వీధి పురాణాలు వినేదానికే పొద్దు చాలదు. ఆమె ఇట్లాంటి పనులు చెయ్యటం కూడానా? కమలమ్మ ఆలోచలు ఇంటి మీదకు వెళ్లాయి.

పెద్దమ్మాయి స్కూలునుండి వచ్చేసుంటుం దేమో, ఇంట్లో పనులన్నీ అదే చేస్తోంది. ముసల్ది ఇక్కడుండే గిన్నె తీసి అక్కడ పెట్టదు. మంచం పైనే అన్నీ జరిగిపోవాలంటుంది. అక్కడికి తానేదో మరబొమ్మ అయినట్లు, కూలికి నాలికి పోయి గొడ్డు చాకిరీ చేస్తుంటేనే ఇల్లు గడవడం కనా కష్టంగా వుంటోంది.

'రేపు మంగళవారం, మొన్నాడు దినం బాగా లేదు. రెండు రోజులాగి మొదలు తేదీ కాడ్నించి పనిలోకి రా అమ్మాయి.. లెక్క కూడా కరెక్టుగా వుంటుంది. నీ పేరేమిటన్నావ్?' అడిగింది దర్పంగా జానకమ్మ కాలుపైన కాలు వేసుకుని కాళ్లు ఆడిస్తూ.


'కమల.. కమలా అంటారండి'

జానకమ్మ అడగాల్సిన ముఖ్యమైన ప్రశ్నని ఎందుకు మరిచిపోయిందో కమలమ్మకు అర్థం కావటం లేదు. ఎవరింట్లో అయినా పనికి చేరే ముందు సర్వసాధారణంగా ఎవరైనా అడిగే ప్రశ్న అది. ఆ జవాబు పైనే ఆ ఇంట్లో పని చెయ్యటమా లేదా అనే విషయం, యజమాని – సేవకురాలి మధ్య సంబంధాలు అధారపడి ఉంటాయి.

జానకమ్మ వైపు చూసింది కానీ ఆమె వాలకం చూస్తుంటే ఆ ప్రశ్న అడిగేలా అనిపించలేదు.

తన గురించి తనింట్లోని మనుషుల గురించి స్పష్టంగా అన్ని వివరాలు తెలుసుకున్న జానమ్మ ఆ ముఖ్యమైన సంగతి గురించి ఎందుకు వాకబు చెయ్యకుండా ఉంటుంది? ఒకవేళ ఆ ప్రశ్నకు జవాబు సుభద్రకు కూడా తెలియదేమో. ఇద్దరి మధ్యా మరీ అంత పరిచయం కూడా లేదు. బహుశా సుభద్రకు తెలిసి ఉంటే ఆ విషయం జానకమ్మకు తప్పకుండా తెలిసే ఉండాలి. అయితే జానకమ్మ మొహంలో ఎలాంటి భావాలు కనిపించటం లేదు. ఆవిషయం తెలిసి నట్లూ లేదు, తెలియనట్లూ లేదు.

మరి ఎందుకు జానకమ్మకు ఆ సంగతి తెలు సుకోవాలని లేదు? కమలమ్మ బుర్ర వేడెక్కి పోయింది.



రిమోట్‌తో చానల్స్ మారుస్తోంది జానకమ్మ. మధ్య మధ్యలో దానిమ్మ గింజలు తింటోంది. కాళ్ళూ ఆడుతున్నాయి. ఆ వాతావరణం ఏమిటో ఊపిరి పట్టేసినట్లు అనిపించింది కమలమ్మకు.

గత అనుభవాలు కళ్లముందు కదలాడాయి.

సుబ్రమణ్యంనాయుడు వాళ్లింట్లో వాచి దొరకనప్పుడు, నారాయణరెడ్డి వాళ్లింట్లో వెండి హారతి పళ్లెం మాయమైనపుపడు, నీలాంబరి మేడం వాళ్లింటాయన వీధి కుక్క మాదిరి తోకాడించుకుంటూ తన వెనుక బడినప్పుడు, తన తప్పేమీ లేకపోయినా దొంగతనం అనే మాటే తనకు తెలియకపోయినా, రంకుతనం రక్తంలో లేకపోయినా అందరూ ఒకే మాటన్నారు.

ఏం మాట అది?

రక్తాన్ని మరిగించే మాట!

'యాడ పోతుంది? ఆ జాతి బుద్ధే అంత!'

అంతో ఇంతో చదువుకుంది కాబట్టి అడిగిన వాళ్లనే ఎదురుగా నాలుగు అడిగింది. కానీ ఆ తరువాతైనా జరిగిందేమిటి? పని మానెయ్యాల్సి వచ్చింది.

కొంచెం చదువుకుంది కదా, దానికి వళ్లంతా పొగరే అనే మాటొకటి అదనంగా.

ఇండ్లల్లో పనులు మానేసి బయట ఎక్కడైనా పనులు వెతుక్కుందామా అంటే శరీరం సహకరించదు. ఒంట్లో నీరసం ఎక్కువ. రక్తం, శక్తి తక్కువ.

కమలమ్మకు ఒంకో ఆలోచన కూడా వచ్చింది. ఈ జానకమ్మ అయినా రేపో, ఎల్లుండో పదీ పదైదు రోజులు పనులన్నీ చేయించేసుకుని ఆనక నీ కులమేమిటమ్మా అని అడిగి తెలుసుకుని 'అయ్యో నాకు తెలీకుండా పనికి పెట్టుకున్నానే, మానేయమ్మా' అని అనదని గ్యారెంటీ ఏమిటి. జీతం గీతం లేదు పొమ్మంటే తన పరిస్థితి ఏమిటి?


పనిలో పొరబాటు జరిగినా.. తప్పిదం జరిగినా, ఆమె మొగుడో, తమ్ముడో, కొడుకో ఎవడో ఒకడు చొంగ కార్చుకుంటే అప్పుడయినా ఈ జానకమ్మ జాతి బుద్దని అనకుండా వుంటుందా?

'ఇండ్లల్లో పాచి పనులు చేసే దానిక్కూడా కులం అడ్డొస్తోంది. తిట్టటానికి, తప్పు పట్టడానికి కారణాలేం లేకపోయినా కులాన్ని సాకుగా చూపేస్తారు సులభంగా' అనుకుంటూ అంత్య నిష్ఠూరం ఎందుకనుకుంటూ 'మాకులం గురించి చెప్పలేదమ్మా, ఎరుకలోళ్లం తల్లీ' నింపాదిగా జానకమ్మ వైపు చూస్తూ స్పష్టంగా అంది కమలమ్మ.

★

పలమనేరు బాలాజి
9440995010

కవిత



# వసంత మేఘం కోసం

నీ చిరునవ్వుల పూదోటలో నేనొక సీతాకోక చిలుకనవ్వాలని ఉంది
కరుణించు ప్రియతమా! కరుణించు
నీ కనుపాపలపై నేనొక్కణ్ణే కనిపించాలని ఉంది

***

ఈ వెలుతురులూ వెన్నెలలూ ఈ చల్లని నీడలూ
ఏ వ్యక్తి స్వార్థానికీ సొంతానికీ కాదు
మనిషి ప్రకృతి బిడ్డ
రెక్కలు తెగి నీ ప్రేమపంజరంలో జీవించలేను
క్షమించు స్నేహితుడా! క్షమించు
స్వేచ్ఛ చాలా గొప్పది

***

నా నిరీక్షణలూ నిద్రలేని రాత్రులూ నా నిర్మల ప్రణయ గీతాలూ
వ్యర్థమేనా?
నా బతుకు శూన్యమేనా?
కనికరించు ప్రియతమా! కనికరించు
నీ హృదయ సరోవరంలో నేనొక హంసనవ్వాలని ఉంది

***

జీవితమొక జీవనదీ ప్రయాణం ఒక ఆకుపచ్చని సౌందర్యం
ఒక మైత్రీ ప్రపంచం
విస్తరించలేని జీవితం విశాలమవ్వలేని జీవితం నాకొద్దు
ప్రవహించు మిత్రుడా! ప్రవహించు
మనిషి ప్రవాహం కానప్పుడు మరణించినట్టే..

***

తానెక్కడుందో తానెలా ఉందో
ఏ తురాయి పూలచెట్టుకింద కొత్తలోకం గురించి కలలు కంటుందో
ఏ సూర్యోదయం వైపు పిట్టల గుంపై సాగిపోతుందో
ఏ గాయపడ్డ ప్రాణిని జాలితో లాలిస్తుందో
వసంత మేఘమా!
ఓసారి
మళ్లీ కనిపించి వెళ్ళవూ.

-నన్నపనేని రవి